క్లుప్తంగా

గురుకులంలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అర్ధవీడు: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికిగాను 6, 7, 8, 9వ తరగతిలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 23వ తేదీలోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బండి బలరామిరెడ్డి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు దర్శి గురుకులంలో ఈ నెల 25వ తేదీ ఉదయం 10 నుంచి 11 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష రాసి పాఠశాలలో ఇంకా చేరని విద్యార్థులకు ఈ నెల 23న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9000660581ను సంప్రదించాలని సూచించారు.

నేడు సీఐటీయూ మండల మహాసభ

బేస్తవారిపేట: స్థానిక కందుల ఓబుల్‌రెడ్డి డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం ఉదయం 10 గంటలకు సీఐటీయూ మండల మహాసభ నిర్వహిస్తుననట్లు సంఘ కంభం మండల కార్యదర్శి షేక్ అన్వర్‌బాషా తెలిపారు. మండల నూతన కార్యవర్గ ఎన్నికలు జిల్లా కార్యదర్శి కె.సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహాసభలో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఓ ప్రకటనలో కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

మార్కాపురం: మార్కాపురం ఆర్టీసీ డిపోలో శనివారం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు తెలిపారు. ఆర్టీసీ బస్సుల రాకపోకల విషయంలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు సలహాలు, సూచనలను 99592 25699కు తెలియజేయాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో మండలంలోని ఇడమకల్లు, నరసింహునిపల్లె, క్రిష్ణంపల్లె, లింగారెడ్డిపల్లె, బాలిరెడ్డిపల్లె, యర్రంశెట్టివానిపల్లె, పుల్లారెడ్డిపల్లె గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

మార్కాపురం మండలంలో..

మార్కాపురం: మండలంలోని గజ్జలకొండ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా అన్ని ఫీడర్లకు శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ నాగేంద్రరెడ్డి తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఐదుగురికి జరిమానా

బేస్తవారిపేట: మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురిని అరెస్ట్ చేసి శుక్రవారం గిద్దలూరు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టులో హాజరుపరచగా శిక్ష విధించారని ఎస్సై రవీంద్రారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఐదుగురు నిందితులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా, ఒకరికి ఐదు రోజులు, ఇద్దరికి మూడు రోజులు, ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి కె.భరత్ చంద్ర తీర్పు వెల్లడించారని ఎస్సై వివరించారు.

కొమరోలు మండలంలో..

కొమరోలు: మండలంలో మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరు వ్యక్తులకు కోర్టు జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్లుగా ఎస్సై నాగరాజు తెలిపారు. ఇద్దరు నిందితులను శుక్రవారం గిద్దలూరు కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానాతోపాటు 5 రోజులపాటు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి కె.భరత్‌చంద్ర తీర్పు చెప్పారని పేర్కొన్నారు. జరిమానా చెల్లించకుంటే మరో 15 రోజులు అదనంగా జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నట్లు తెలిపారు.

'నాడు-నేడు'కు చంద్ర గ్రహణం

విద్యా సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మనబడి నాడు-నేడు కింద అభివృద్ధి పనులు చేపట్టింది. నాడు-నేడు ఫేజ్-1 కింద చేపట్టిన పనుల్లో 90 శాతం మేర పూర్తి కాగా విద్యార్థులకు మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చాయి. నాడు-నేడు ఫేజ్-2 కింద చేపట్టిన భవనాలు వివిధ దశల్లో నిలిచిపోయాయి. గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాఠశాల నిర్మాణాలకు సంబంధించిన నిధులను నిలిపివేసింది. దీంతో భవన నిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఇరుకు గదుల్లో కూర్చుని ఇబ్బంది పడుతున్న విద్యార్థులను అసంపూర్తిగా ఉన్న భవనాలు వెక్కిరిస్తున్నాయి.



తుమ్మలచెరువు జెడ్పీ హైస్కూల్లో శ్లాబ్ తర్వాత నిలిచిన అదనపు తరగతి గదులు

తర్లుపాడు:

మండలంలోని సర్కారు బడుల్లో సుమారు 5 వేల మందికిపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థులకు సరిపడా భవనాలు లేకపోవడంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు-నేడు మొదటి విడతలో భాగంగా 21 పాఠశాలలను ఎంపిక చేసి రూ.4.92 కోట్లు విడుదల చేసి నిర్మాణాలు పూర్తి చేసింది. 2వ విడతలో భాగంగా 24 పాఠశాలలకుగానూ 11.37 కోట్ల రూపాయల నిధులు కేటాయించింది. ఇందులో కొన్ని భవనాలు పూర్తయ్యాయి. మరికొన్ని వివిధ దశల్లో అసంపూర్తిగా మిగిలి ఉన్నాయి. దీంతో అదనపు తరగతి గదులు పూర్తికాక, ఉన్న గదులు సరిపోక విద్యార్థులు ఇరుకు గదుల్లోనే చదువులు కొనసాగిస్తున్నారు. వేసవి సెలవుల్లోనే భవన నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థులు మరో ఏడాదిపాటు సమస్యలతో సహవాసం చేస్తూ చదువు కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమంపై దృష్టిపెట్టి నూతన భవనాలు, టాయిలెట్లు, వంటశాలలను అందుబాటులోకి తీసుకొనిరావాలని విద్యావేత్తలు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థులకు అందని కిట్లు

పాఠశాలలు పునఃప్రారంభమైన రోజునే విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు అందిస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించినా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. నేటికీ పలు పాఠశాలల్లో యూనిఫాం, బ్యాగులు, షూష్ అందించలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సర్కారు నిర్వాకంతో అవస్థలు

మండలకేంద్రం తర్లుపాడులోని ఎంపీపీ ఏపీ పాఠశాల, తుమ్మలచెరువు జెడ్పీహెచ్ఎస్, మీర్జాపేట జెడ్పీహెచ్ఎస్, కలుజువ్వలపాడులోని ఎస్సీ కాలనీ ఎంపీపీ స్కూల్, కేతగుడిపి ఎస్సీ కాలనీలోని స్కూల్లో భవనాలు శ్లాబ్ దశ వరకు పూర్తయ్యాయి. స్వల్ప మొత్తంలో నిధులు ఖర్చు చేసినా భవనాలు పూర్తయి విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయి. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం గత ఏడాది కాలంగా నిధులు విడుదల చేయకుండా విద్యార్థులను కష్టాలపాలు చేస్తోంది. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయుల కొరత

మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. ముఖ్యంగా ఓబాయపల్లి, రోలుగుంపాడు జనరల్, మంగళకుంట, కొండారెడ్డిపల్లిలో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థుల చదువులు కుంటుపడుతున్నాయి.



నిలిచిన మీర్జపేట జడ్పీహెచ్ఎస్ అదనపు తరగతి గదులు



మీర్జపేట జెడ్పీహెచ్ఎస్‌లో నిలిచిన ఆడిటోరియం పనులు

బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు

- మార్కాపురం డిపో నుంచి వైజాగ్‌కు 15 బస్సుల కేటాయింపు
- ఒంగోలు, విజయవాడ రూట్లలో బస్సుల తగ్గింపు



ఒంగోలు వెళ్లే బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు

మార్కాపురం: విశాఖపట్నంలో యోగాంధ్ర సదస్సుకు మార్కాపురం డిపో నుంచి 15 బస్సులు పంపడంతో ఆయా రూట్లలో వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఒంగోలు, విజయవాడతోపాటు పలు రూట్లలో రోజూ ప్రయాణికులను గమ్యస్థానానికి చేరవేసే 15 బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలు, రాష్ట్ర రాజధాని విజయవాడ రూట్లలో తిరిగిన కొన్ని బస్సుల్లో రద్దీ ఏర్పడింది. పుల్లలచెరువు, యర్రగొండపాలెం, పెద్దదోర్నాల, పెద్దారవీడు, త్రిపురాంతకం తదితర ప్రాంతాల నుంచి ఒంగోలు వెళ్లే ప్రయాణికులు మార్కాపురానికి వచ్చి అక్కడి నుంచి ఒంగోలు బస్సు ఎక్కి వెళ్తుంటారు. అయితే ఒంగోలుకు వెళ్లే బస్సుల సంఖ్య తగ్గిపోవడంతో వీరందరూ కూడా మార్కాపురం ఆర్టీసీ బస్టాండులో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. విజయవాడ వెళ్లేందుకు ప్రైవేట్ వాహనాలు, రైళ్లను ఆశ్రయించారు. సాధారణంగా ఒంగోలు రూట్‌లో ప్రతి అర గంటకు ఒక బస్సు ఉండేది. శుక్రవారం మాత్రం రెండు గంటలపాటు వేచి ఉన్నా బస్సులు బస్టాండుకు రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురయ్యారు. శనివారం కూడా ఇదే పరిస్థితి ఉంటుందని పలువురు ప్రయాణికులు నిట్టూర్చారు.

రెవెన్యూ వ్యవస్థపై అవగాహన అవసరం



మార్కాపురంలో ర్యాలీలో పాల్గొన్న సబ్ కలెక్టర్ త్రివినాగ్, రెవెన్యూ ఉద్యోగులు

మార్కాపురం: రెవెన్యూ వ్యవస్థపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ పేర్కొన్నారు. శుక్రవారం రెవెన్యూ డే సందర్భంగా మార్కాపురం పట్టణంలో సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. రెవెన్యూ సేవ అంటే రైతులకు సేవ అనే ప్లకార్డులు ప్రదర్శించారు. స్థానిక గడియార స్తంభం సెంటరులో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో తహసీల్దార్లు చిరంజీవి, కిరణ్, భాగ్యలక్ష్మి, డీటీ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బేస్తవారిపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు రెవెన్యూ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయం వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ప్రజలకు, రైతులకు అందించే సేవల గురించి తహసీల్దార్ జితేంద్రకుమార్ వివరించారు. రిటైర్డ్ తహసీల్దార్ సయ్యద్ ఇస్మాయిల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సర్వేయర్లు, వీఆర్ఏలు పాల్గొన్నారు.



బేస్తవారిపేటలో ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్, ఉద్యోగులు

మండల అభివృద్ధికి కృషి చేయాలి



విద్యుత్ సమస్యపై ఏఈని ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ మౌలాలి

కొమరోలు: మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ కామూరి అమూల్య సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ షేక్ మౌలాలి విద్యుత్ సమస్యలపై ప్రశ్నించారు. కొమరోలులో లోవోల్టేజ్ సమస్య వలన వినియగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యను పరిష్కరించాలని ఏఈ శ్రీనివాసులును కోరారు. పలువురు సభ్యులు గ్రామాల్లో సమస్యలను లేవనెత్తారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. సమస్యలపై ఆయా శాఖల అధికారులు దృష్టిసారించి వేగంగా పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మానవ జన్మ సార్థకం చేసుకోవాలి



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

మార్కాపురం టౌన్: మానవ జన్మ లభించడం ఎన్నో జన్మల పుణ్యమని, ఆ జన్మను సార్థకం చేసుకోవాలని సాయి టీవీ చానల్ చైర్మన్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని నెహ్రూ బజారులో ఉన్న సాయిబాబా మందిరంలో ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. భగవంతుడు మానవజన్మ ఇచ్చింది మానవత్వం చాటుకోవడం కోసమేనని, మనిషి తన తోటి వారిని, తన చుట్టూ ఉన్న సకల జీవరాశిని, ప్రకృతిని, నీతి నియమాలను, ధర్మాన్ని పాటించాలన్నారు. భగవంతుడిని ఆరాధించి ముక్తిమార్గం వైపు పయనించడమే మానవ ధర్మమని సాయినాథుడు బోధించారన్నారు. మరణం ఎప్పుడు సంభవిస్తుందో తెలియదని, తోటి మానవులతో ప్రేమ ఆప్యాయతతో నడుచుకోవాలని సూచించారు. సాయి టీవీ ద్వారా భక్తుల అనుభవాలను ప్రసారం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయనను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మందిర అధ్యక్ష కార్యదర్శులు పేరం సత్యనారాయణ, గోపాలుని హరిహరరావు, కోశాధికారి నాగరాజు, కమిటీ సభ్యులు వెంకటేశ్వరరెడ్డి, రమణారెడ్డి, మధు, రామారావు, సాయిబాబా, పిచ్చిరావు, మహిళా సభ్యులు భారతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు నైపుణ్య శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ

కంభం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ వీరభద్రాచారి అధ్యక్షతన మహిళలకు ఆర్థిక ఎదుగుదలపై అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి థామ్సన్, ధనలక్ష్మి టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలకు నైపుణ్యాభివృద్ధిపై మెళకువలు నేర్పించారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంకమ్మతల్లి కొలుపులు



ప్రత్యేక అలంకరణలో అంకమ్మతల్లి



జమ్మి ఉత్సవంలో భక్తులు

కొనకనమిట్ల: మండలంలోని సిద్ధవరం గ్రామంలో శుక్రవారం సాయంత్రం అంకమ్మతల్లి అమ్మవారి కొలుపుల ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవం సందర్భంగా అంకమ్మతల్లికి భిక్ష, సముద్రస్నానంతో పాటు జమ్మిచెట్టు దగ్గర పూజలు నిర్వహించారు. రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి కలశ ఉత్సవంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని నైవేద్యాలు సమర్పించారు. శనివారం జల్ది ఉత్సవం, ఆదివారం భక్తులకు అన్న సంతర్పణ నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు, మాజీ సర్పంచ్ యలమంద శ్రీను తెలిపారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న బ్యాంకు యూనియన్ సభ్యులు

మార్కాపురం: కమ్యూనిస్ట్ నాయకుడు వై.తారకనాథ్ 21వ వర్ధంతిని పురస్కరించుకుని మార్కాపురం పట్టణ స్టేట్‌బ్యాంకు స్టాఫ్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. సమాజంలో నిరుపేదలకు సహాయసహకారాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు యూనియన్ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టేట్‌బ్యాంకు యూనియన్ నాయకులు షేక్ గౌస్‌బాషా, కాశిరెడ్డి, చంద్రకాంత్, ఫణీంద్ర, గీతాంజలి, మస్తాన్‌వలి, రాజశేఖర్‌రెడ్డి, నాగులషరీఫ్, రాఘవేంద్ర, అక్బర్ అలీ, హోంగార్డు కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు



ప్రమాదానికి గురైన కారు

మార్కాపురం టౌన్: కారు అదుపుతప్పి చెట్టును ఢీకొన్న సంఘటన శుక్రవారం జాతీయ రహదారిపై బోడపాడు జంక్షన్ వద్ద చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. దోర్నాల నుంచి పొదిలి వైపు వెళ్తున్న కారు మార్కాపురం మండలంలోని బోడపాడు జాతీయ రహదారి జంక్షన్ వద్ద అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ప్రైవేట్ స్కూళ్ల బస్సులు నిబంధనలు పాటించాలి



డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

కంభం: ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు నిబంధనలు పాటిస్తూ బస్సులు నడపాలని సీఐ కె.మల్లిఖార్జున, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు సూచించారు. కంభం పట్టణంలో ప్రైవేట్ స్కూల్ బస్సుల డ్రైవర్లు, యాజమాన్యంతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ స్కూల్ బస్సులను పరిశీలించారు. బస్సులు కండీషన్‌లో ఉండేలా చూసుకోవాలని, పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించరాదన్నారు. కాలం చెల్లిన బస్సులను విద్యార్థుల రవాణా కోసం వినియోగించరాదని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి బస్సులు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం డ్రైవర్లు, క్లీనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్సై నరసింహారావు, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

వాహన చట్టం అతిక్రమిస్తే కఠిన చర్యలు



ఆటోలను తనిఖీ చేస్తున్న అధికారులు

మార్కాపురం టౌన్: ఆటో డ్రైవర్లు వాహనాల చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మార్కాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు, ఒంగోలు ఎంవీఐ హెచ్చరించారు. శుక్రవారం మార్కాపురం సమీపంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఆటోలను తనిఖీ చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న ఆటోవాలాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మొత్తం 18 ఆటోలను తనిఖీ చేసి నిబంధనలు అతిక్రమించిన వారికి 1.49 లక్షల రూపాయలు జరిమానా విధించారు. 4 ఆటోలను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.